క్లుప్తంగా

భవిష్యత్‌కు దిక్సూచి భవిత కేంద్రాలు



ఫిజియోథెరపీని పరిశీలిస్తున్న ఎంఈఓ సుభాన్

పగిడ్యాల: విభిన్న ప్రతిభావంతుల భవిష్యత్‌కు దిక్సూచిలా భవిత కేంద్రాలు పనిచేస్తున్నాయని మండల విద్యాధికారి సుభాన్ అన్నారు. సోమవారం స్థానిక భవిత కేంద్రంలో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ క్యాంప్‌ను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ అంగవైకల్యం పిల్లలకు శాపం కారాదన్నారు. అందుకే ప్రభుత్వం వారి అభ్యున్నతికి ప్రతి మండల కేంద్రంలో భవిత కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. భవిత కేంద్రానికి వచ్చే వైకల్యం కలిగిన పిల్లలకు నిపుణులైన ఫిజియోథెరపిస్టు చేత శిక్షణ ఇప్పించి వారిలో మార్పులు వచ్చేలా కృషి చేస్తున్నారని వివరించారు. అందువల్ల పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రంలో లభించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు కృష్ణప్రియ, ఐఈఆర్‌టీలు రామకృష్ణయ్య, అరుణకుమారి తదితరులు ఉన్నారు.

పాఠశాలలకు క్రీడాసామగ్రి అందజేత



బీరవోలు పాఠశాలకు స్పోర్ట్స్ కిట్‌ను అందజేస్తున్న ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి

పగిడ్యాల: మండలంలోని అన్ని పాఠశాలలకు ప్రభుత్వం మంజూరు చేసిన క్రీడా సామగ్రిని అందజేసినట్లు ఎంఈఓ-1 సుభాన్, ఎంఈఓ-2 మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారంస్థానిక విద్యాధికారి కార్యాలయంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 29 పాఠశాలకు కిట్లు అందజేశామన్నారు. అందులో వాలీబాల్, త్రో బాల్, హ్యాండ్ బాల్, టెన్నికాయిట్ రింగ్స్, స్కిప్పింగ్ రోప్స్, యోగా మ్యాట్లు, చెస్ బోర్డులు, ఫుట్ బాల్, ఫుట్ బాల్ పంప్, వెయింగ్ మిషన్, షాట్ పుట్, డిస్కస్ త్రో రబ్బర్స్, మెజర్‌మెంట్ టేప్ తదితర సామగ్రి పిల్లల సంఖ్యను బట్టి వచ్చాయని చెప్పారు.

రైతులను ఆదుకోవాలి

నందికొట్కూరు రూరల్ : వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందజేయాలని రైతుసంఘం జిల్లా నాయకులు బెస్తరాజు, వ్యాకాస నాయకులు ఫక్కీర్‌సాహెబ్ కోరారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మికసంఘం నాయకులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి పంటల బీమాను ప్రభుత్వమే చెల్లించాలన్నారు. అనంతరం తహసీల్దార్ రాజశేఖర్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళాసంఘం నాయకురాలు బీబీ, సాయిదాబీ, వ్యాకాస నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జయపాల్

వెలుగోడు: వెలుగోడు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల జైపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో నంద్యాల శాంతిరాం హాస్పిటల్ డాక్టర్లు రోగులను పరీక్షించారు. బీపీ, షుగర్, ఈసీజీ టెస్టులు చేసి, రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో హరిలీల, జూనియర్ అసిస్టెంట్ బాలవర్ధిరాజు పాల్గొన్నారు.

గోసేవతో పుణ్యఫలం



ఫ్యాన్లు అందిస్తున్న డీఈఈ రవికాంత్ దంపతులు

మహానంది: ముక్కోటి దేవతలకు నిలయమైన గోవులకు సేవలందించడం ఎంతో పుణ్యఫలమని మహానంది ఆలయ సూపరింటెండెంట్ ఓంకారం వెంకటేశ్వరుడు అన్నారు. అహోబిలానికి చెందిన రంగారావు జ్ఞాపకార్థం విద్యుత్‌శాఖ డీఈఈ రవికాంత్ సోమవారం రూ.60వేల విలువైన 21 ఫ్యాన్లను గోశాలకు విరాళంగా అందించారు. వేదపండితులు శాంతారాంభట్, గోశాల అర్చకులు శరభయ్యశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. దాతలకు స్వామివారి ప్రసాదాలు అందించి శేషవస్త్రాలతో సన్మానించారు.

హైస్పీడుగా హైవే పనులు

- 4 లేన్లుగా 340సీ జాతీయ రహదారి
- జోరుగా డోజర్లతో భూమి చదువు చేసే పనులు
- భూములకు పెగిరిన డిమాండ్



నేషనల్‌హైవే పనుల్లో భాగంగా నేలను చదును చేస్తున్నమిషన్లు

పాములపాడు: రాకపోకలు సౌలభ్యంగా ఉన్నప్పుడే గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో జరుగుతున్న నేషనల్‌హైవే 340సీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలో 4 లేన్ల రహదారి నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. రెండేళ్ల నుంచి సర్వే పనులు జరుగుతున్నప్పటికి రహదారి పనులు ఇప్పట్లో జరిగేది కాదులే అని మాట్లాడుకున్న వారు ప్రస్తుతం జరుగుతున్న పనులు చూస్తే హవ్వా అనక మానరు.

60 మీటర్ల వెడెల్పుతో రహదారి..

మండలంలో సుమారు 15 కిలో మీటర్ల మేర జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. 60 మీటర్ల వెడెల్పుతో రోడ్డు వేస్తున్నారు. మండలంలోని క్రిష్ణారావుపేట, జూటూరు, రుద్రవరం, పాములపాడు, కంబాలపల్లి, యర్రగూడూరు, బానుముక్కల గ్రామాల మీదుగా సుమారు 85 ఎకరాల భూమి రహదారి నిమిత్తం ప్రభుత్వం సేకరించింది. మండల కేంద్రమైన పాములపాడులో గ్రామం వెలుపల, మిగతా గ్రామాల్లో ఉన్న రహదారినే వెడెల్పు చేయనున్నారు. హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటికే వారి బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమ చేయడం జరిగింది. దీంతో మిషన్లతో పనులు చేపట్టారు. భూమిని డోజర్లతో చదును చేస్తున్నారు.

భూముల ధరలకు రెక్కలు

హైవే పనులు ప్రారంభం కావడంతో రహదారి పక్కనున్న భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఎకరం భూమి కోటి రూపాయలకు పైగా నే ధరలు పలుకుతున్నాయి. హైవేలో భూములు కోల్పోయిన రైతులు కొంత మిగిలినను కోటీశ్వరులైనట్లే. ప్రస్తుతం నిర్మాణం పనులతో కచ్చితంగా భూమి ఎంత పోతుందో తెలిసింది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇక్కడ వాలిపోయారు. మధ్యవర్తులు సైతం కమీషన్ల కోసం బేరసారాలు చేస్తున్నారు. కొందరు ఏకంగా హైవే పక్కనున్న పొలాల రైతుల అడ్రస్సులను తెలుసుకొని వారి ఇండ్ల వద్దకు వెళ్లి ఆశ్రయిస్తున్నారు. మేము ఇప్పట్లో అమ్మబోమని స్పష్టం చేసినా.. ఎవ్వరికి చెపొద్దు, మీరు ఎప్పుడు అమ్మాలనుకున్నను నాకే చెప్పండి. ధర సరిపోకపోతే చెప్పండి, మన వద్ద మంచి పార్టీ ఉంది.. అంటూ చెప్పడం వారి వంతైంది.

మండలం మరింత అభివృద్ధి చెందుతుంది



హైవే వలన మండలం మరింత అభివృద్ధి చెందుతుంది. ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోంది. ప్రస్తుతం పనులు అనుకున్నదాని కంటే ముందుగానే మొదలుపెట్టారు. త్వరితగతిన పనులు పూర్తి చేస్తే హైవే రోడ్డు మీద రయ్‌రయ్ అని వాహనాలు పరుగుపెడతాయి.

–రామిరెడ్డి, ఇస్కాల

రహదారులతో అభివృద్ధి



రహదారుల నిర్మాణాలతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. జాతీయ రహదారి పనులు పూర్తయితే ప్రయాణ సమయం తగ్గుతుంది. పనులు ఇంత తొందరగా ప్రారంభిస్తారని అనుకోలేదు. కొందరు రైతులు పనులు ఆలస్యమవుతాయని పైర్లు సాగు చేశారు. –నాగరాజు, రైతు, పాములపాడు

మహానందీశ్వరస్వామికి పల్లకీసేవ



పల్లకీలో విహరిస్తున్న మహానందీశ్వరస్వామి

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ కనులపండుగగా జరిగింది. వేదపండితులు, అర్చకులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు చేశారు. పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఆత్మకూరు: లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్ , ఏపీపీ రాజేంద్రప్రసాద్, ఆత్మకూరు వైద్యాధికారి రాయుడు, ఎస్‌ఐ కృష్ణమూర్తి అన్నారు. పట్టణంలోని కొత్తబస్టాండ్ , ప్రభుత్వ వైద్యశాలలో లింగనిర్ధారణ పరీక్షలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ధనలక్ష్మి, మద్దిలేటి, ఎన్జీఓ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష



దుద్యాల గ్రామంలో ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

నందికొట్కూరు: ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించింది. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఆరోగ్య ఇబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి మ్యాపింగ్ చేస్తున్నారు. ఏ కుటుంబంలో ఎవరు ఏ విధమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారో గుర్తించి టోకెన్లు అందజేస్తున్నారు. వీరికి ఆయా గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాల్లో అవసరమైన పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలు అందచనున్నారు.

పరీక్ష చేసి బీపీ అని చెప్పారు



ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు చేసి బీపీ ఎక్కువ ఉందని గుర్తించారు. నందికొట్కూరులో ప్రైవేటు వైద్యశాలకు వెళ్లకుండా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటికే డాక్టర్లు, ఆశ వర్కర్లు వచ్చి వైద్య పరీక్షలు చేసి ఏ జబ్బు ఉన్నది చెబుతున్నారు. వచ్చే నెలలో జరిగే హెల్త్ క్యాంపులో ఉచితంగా వైద్యం, మందులు ఇస్తారని ఒక టోకన్ ఇచ్చారు. ఊరిలోనే వైద్య శిబిరం నిర్వహించడంతో వ్యయప్రయాసలు తప్పాయి.

– ఉత్తమ్మ కొణిదేల గ్రామం, నందికొట్కూరు మండలం

పైసా ఖర్చు చేకుండా వైద్య పరీక్షలు



మాది మారుమూల గ్రామం. ఏ జబ్బు చేసినా 12 కిలో మీటర్లు దూరం ఆత్మకూరుకు వెళ్లాల్సి వచ్చేది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇంటికి వైద్య బృందం వచ్చి పరీక్షలు చేశారు. లివర్ సమస్య కనిపిస్తుందని వైద్యులు చెప్పారు. నాకు పరీక్షలు చేసి ఒక టోకన్ ఇచ్చారు. వచ్చే నెల 6వ తేదీన ఊరిలోనేనిర్వహిస్తున్న హెల్త్ క్యాంపులో వైద్యులు చెప్పే సలహాల ప్రకారం వైద్యం చేయించుకుంటాను.

– కిరణ్‌కుమార్ గువ్వలకుంట్ల గ్రామం, కొత్తపల్లి మండలం

80 శాతం సబ్సిడీతో విత్తనాల పంపిణీ



పాములపాడులో రైతులకు సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ గోపీకృష్ణ

పాములపాడు: రైతులకు ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ, మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ఆకస్మిక విత్తన పథకం కింద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో పైర్లు చెడగొట్టిన రైతులకు మొక్క జొన్న, జొన్న విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు. మొక్కజొన్న సూపర్‌సిస్ రకం 45 క్వింటాళ్లు, జొన్న లైలా రకం 10 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. మొక్కజొన్న 4 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.1190, కాగా సబ్సిడీతో రూ.238, జొన్న 3 కేజీల ప్యాకెట్ పూర్తి ధర రూ.660 కాగా సబ్సిడీతో రూ.132 లకే అందిస్తున్నట్లు వివరించారు. త్వరలో మినుము, శనగ విత్తనాలు కూడా పంపిణీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ జుబేర్, కంపెనీ ప్రతినిధి రమణారెడ్డి, వీఏఏ గాయత్రీ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: రబీ సీజన్‌కుగాను రైతులకు అవసరమైన శనగ విత్తనాలు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 700 క్వింటాళ్ల జేజీ 11 రకం శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. అవసరమైన రైతులు ఆర్బీకేల్లో పేర్లు నమోదు చేసుకొని రాయితీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

గతేడాది కంటే 75కిలోలు అధికంగా..

గతేడాది ఇచ్చిన రాయితీ విత్తనాల కంటే ఈ ఏడాది ఓ రైతుకు 75కిలోల విత్తనాలు అధికంగా అందజేస్తున్నట్లు ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. గతేడాది ఐదు ఎకరాల వరకు రైతులకు 125కిలోల విత్తనాలు అందజేయగా ఈ ఏడాది 200కిలోల విత్తనాలు అందజేస్తున్నట్లు చెప్పారు.

మిడుతూరు : మండలంలోని రైతుభరోసా కేంద్రాలకు 1100 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు ఏవో పీర్‌సాహెబ్ సోమవారం తెలిపారు. వీటిని ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్నట్లు వెల్లడించారు.

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండలానికి 1400క్వింటాళ్ల శనగ విత్తనాలను సబ్సిడీ కింద రైతులకు అందజేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఏవో షేక్షావలి తెలిపారు

గ్రామాల అభివృద్ధి కోసమే 'గడప గడపకు'



అబ్బీపురంలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ శ్రీలక్ష్మి

మహానంది: గ్రామాల అభివృద్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందని వ్యవసాయ సలహామండలి చైర్మన్ శవ్వా శరభారెడ్డి, అబ్బీపురం సర్పంచ్ శ్రీలక్ష్మి తెలిపారు. రూ. 20లక్షలతో సీసీ రహదారులు, ఎస్సీ కాలనీలోని శ్మశానం వద్దకు వెళ్లేందుకు అవసరమైన వంతెన పనులకు సోమవారం భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో ఇప్పటికే గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గడప గడపకు మనప్రభుత్వం ద్వారా రూ.20లక్షలతో నాలుగు రహదారులు నిర్మించనున్నట్లు తెలిపారు.

అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచు మేకల భాగ్యమ్మ

పాములపాడు: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో అంతర్గత రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు సర్పంచు మేకల భాగ్యమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రామాలయం వీధిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందన్నారు. ఈ క్రమంలోనే గ్రామంలో ప్రాముఖ్యతను బట్టి సీసీ రహదారులు, డ్రైనేజీ నిర్మాణాల పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, సింగిల్ విండో చైర్మన్ వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ చౌడయ్య, జేసీఎస్ కన్వీనర్ నాగరాజు, వార్డు సభ్యురాలు శ్రీలత , వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదిదంపతుల అనుగ్రహంతో అభివృద్ధి

- శ్రీశైలం మాజీ ఈఓ ఎస్.లవన్న
- సిబ్బంది అందించిన సహకారం మరువలేనిది
- మాజీ ఈఓకు వీడ్కోలు పలికిన అధికారులు, సిబ్బంది



పూర్వ ఈఓ, ప్రస్తుత ఈఓలను సత్కరిస్తున్న అధికారులు



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల కల్పనకు, తాను చేపట్టిన చర్యలకు సత్ఫలితాలు రావడమనేది కేవలం ఆదిదంపతులైన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల అనుగ్రహంతోనే సాధ్యమైందని శ్రీశైల దేవస్థాన మాజీ ఈఓ ఎస్.లవన్న అన్నారు. సోమవారం దేవస్థాన ఈఓ బాధ్యతల నుంచి రిలీవ్ అయ్యారు. నూతన ఈఓగా డి.పెద్దిరాజు బాధ్యతలు స్వీకరించారు. దేవస్థాన సిబ్బంది పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో ఎస్.లవన్నకు వీడ్కోలు, నూతన ఈఓ డి.పెద్దిరాజుకు స్వాగత సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురు అధికారులు, అర్చకస్వాములు లవన్న చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావిస్తూ, ఆయన సేవలను కొనియాడారు. లవన్న మాట్లాడుతూ దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రోత్సాహం, నిరంతర పర్యవేక్షణ వలన క్షేత్రాభివృద్ధికి చక్కటి అవకాశం లభించిందన్నారు. అలాగే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ధర్మకర్తల మండలి ఎప్పటికప్పు డు సంపూర్ణ సహకారాలను అందించారని చెప్పారు. దేవస్థాన సిబ్బంది అందరూ కూడా ఒక కుటుంబ పెద్దగా భావించి తనకు చేదోడువాదోడుగా నిలిచి, అంకితభావంతో సహాయ సహకారాలను అందించడంతో తన ఆలోచనలన్నీ కార్యరూపం దాల్చాయన్నారు. దేవస్థాన సిబ్బంది సహకారం మరువలేనిదని అన్నారు. ఈ సందర్భంగా అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భగవంతుడికి, భక్తులకు సేవచేసే అవకాశం..

నూతన ఈఓ డి.పెద్దిరాజు మాట్లాడుతూ దేవాలయాల్లో పని చేసే ఉద్యోగులకు అటు భగవంతుడిని, ఇటు భక్తులను సేవించుకునే అవకాశం ఉంటుందన్నారు. క్షేత్రాన్ని సందర్శించే ప్రతి భక్తుడిని అతిథిగా భావించాలన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు సిబ్బంది అందరూ తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. చివరిగా దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సుబ్బారెడ్డి మాజీ ఈఓ, ప్రస్తుత ఈఓ లకు పుష్పగుచ్ఛాలు అందించి, శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అలాగే పలువురు ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు ఘనంగా సత్కరించారు.

ఆర్థిక వనరుల పెంపునకు కృషి



బాధ్యతలు చేపట్టిన మధుమోహనచక్రవర్తి

జూపాడుబంగ్లా: గ్రామాల్లో ఆర్థిక వనరుల పెంపునకు తగిన ప్రణాళికలు రూపొందించి అభివృద్ధికి కృషిచేస్తామని నూతన ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి తెలిపారు. సోమవారం జూపాడుబంగ్లా ఈఓపీఆర్డీగా ఆయన బాధ్యతలు చేపట్టారు. పాములపాడు మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న ఈయన ఈఓపీఆర్డీగా పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

కంటి చూపును నిర్లక్ష్యం చేయొద్దు



కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యార్థులు కంటి చూపును నిర్లక్ష్యం చేయకూడదని కంటి వైద్య నిపుణులు షేక్షావలి, సీహెచ్ఓ బాలకృష్ణ అన్నారు.సోమవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అన్ని అవయవాలు ఎంత ముఖ్యమో కళ్ళు కూడా అంతే ముఖ్యమన్నారు. కంటిచూపును నిర్లక్ష్యం చేస్తే జీవితం అంధకారం అవుతుందన్నారు. కంటిచూపు బాగా ఉండాలంటే పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, చేపలు వంటి ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 200 మంది విద్యార్థినులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

సేవలతోనే నిజమైన సంతృప్తి

మహానంది: పేదలకు సేవలు అందించడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని నంద్యాల జిల్లా అదనపు డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శారదాబాయి తెలిపారు. బండిఆత్మకూరు మండలంలోని ప్రభాత్ ఫార్మసీ కళాశాలలో సోమవారం ఫార్మసిస్ట్ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ నంద్యాల జిల్లా వైస్ చైర్మన్ మారుతీకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ, చైర్మన్ సారథిబాబు, తదితరులు పాల్గొన్నారు. 25 మంది విద్యార్థులు రక్తదానం చేశారు.

సబ్‌ప్లాన్ చట్టాలను అమలు చేయాలి

ఆత్మకూరు: ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కార్మిక సంఘం జిల్లాసహాయ కార్యదర్శి నరసింహనాయక్, భాస్కర్, రామ్‌నాయక్ అన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవనంలో ఈ నెల 29న విజయవాడలో నిర్వహించే మహాధర్నా పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. కార్యక్రమంలో సంజీవరాయుడు , అక్కిరాజు, శ్రీను, స్వాములు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి



మృతదేహాన్ని తీసుకొస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం

మహానంది: బండిఆత్మకూరు మండలం జీసీ పాలెం గ్రామానికి చెందిన మేదరి నర్సప్ప(45) మద్దిలేరువాగులో ఆదివారం గల్లంతైన విషయం తెలిసిందే. నంద్యాల జిల్లా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సభ్యులు ఉదయం వాగు వద్దకు చేరుకుని గాలించి నర్సప్ప మృతదేహాన్ని వెలికితీశారు. నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకునిపోయిన ఆయన ఊపిరాడక మృతి చెందాడు. భర్త మృతితో భార్య, కుమారుడు, కుమార్తెలు రోదించిన తీరు స్థానికులను కంటతడిపెట్టించింది.

శ్రీశైలంలో అభివృద్ధి పనుల పరిశీలన



నక్షత్రవనాన్ని పరిశీలిస్తున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రం నూతన ఈఓగా బాధ్యతలు చేపట్టిన డి.పెద్దిరాజు క్షేత్ర పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సోమవారం సాయంత్రం పరిశీలించారు. ముందుగా భ్రామరీ పుష్పవనం, గో సంరక్షణశాలను పరిశీలించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రింగ్‌రోడ్డు మార్గంలోని నక్షత్ర వనాన్ని సందర్శించారు. గణేశ సదనంలో గదుల నిర్మాణ సంబంధిత అంశాలు, కౌంటర్లు, ఉద్యాన వనాలు తదితర వాటి గురించి అధికారులు ఆయనకు వివరించారు. ధర్మకర్తల మండలి సభ్యులు ఓ.మధుసూదన్‌రెడ్డి, ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి రిమాండ్

కొత్తపల్లి: ఓ ఒంటరి మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన వ్యక్తికి రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ హుస్సేన్ బాషా సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 22వ తేదీ రాత్రి మండలంలోని ఎదురుపాడు గ్రామంలో ఓ మహిళపై అర్ధ రాత్రి అదే గ్రామానికి చెందిన దిబ్బన్న అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. అతనికి కొత్తమాడుగుల గ్రామ శివారుల్లోని క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసి నందికొట్కూరు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించారని చెప్పారు.

9.8 మిల్లీమీటర్ల వర్షపాతం

జూపాడుబంగ్లా: మండలంలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన వర్షం 9.8 మిల్లీ మీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు సోమవారం తెలిపారు. నందికొట్కూరులో 12.4 మి.మీ, జూపాడుబంగ్లా 9.8ఎం.ఎం, పగిడ్యాలలో 2.2ఎం.ఎం, కొత్తపల్లిలో 1.8 మిల్లీమీటర్లు నమోదైందన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత

మహానంది: బండిఆత్మకూరు మండలం ఎర్రగుంట్ల గ్రామానికి చెందిన కాలూరి సుందరమ్మ ఇటీవల మృతి చెందడంతో వైఎస్సార్ బీమా ద్వారా తక్షణ సాయం రూ.10వేలను సోమవారం కుటుంబసభ్యులకు అందించారు. సర్పంచ్ శ్వేతాకుమారి, ఎంపీటీసీ సభ్యుడు బాలన్న పాల్గొన్నారు.

కానిస్టేబుల్ నిజాయితీ

ఆత్మకూరు: పట్టణానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ నారాయణ నిజాయితీని చాటుకున్నాడు. సోమవారం పట్టణంలోని ఇందిరానగర్ చర్చి వద్ద వెళ్తున్న నారాయణకు ఒక పర్స్ కనిపించింది. అందులో ఉన్న సెల్ ఫోన్‌ను పరిశీలించి, బాధిత కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆ మహిళ ఇందిరానగర్ చర్చికి చేరుకోగా కానిస్టేబుల్ నారాయణ సెల్‌ఫోన్ పర్సు, అందులోని రూ.672 నగదును అందజేశారు. ప్రస్తుతం ఈ కానిస్టేబుల్ ఆళ్లగడ్డ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

సంగమేశ్వరంలో ప్రత్యేక పూజలు



కృష్ణాజలాల్లో దర్శనమిస్తున్న సంగమేశ్వరాలయ గోపురం

కొత్తపల్లి: మండలంలోని సంగమేశ్వరం ఎగువ పుష్కరఘాటవద్ద వెలసిన ఉమామహేశ్వరాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భాద్ర పదమాసంలో రెండవ సోమవారం విశేష పూజలు, పరివర్తన ఏకాదశి సందర్భంగా వినాయక నవరాత్రులలో భాగంగా సప్తనదీ సంగమేశ్వరంలో భక్తులచే స్వామి వార్లకు నదిజలాలకు అభిషేకం,కుంకుమార్చన,పుష్పార్చ, మంగళహారతి వంటి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు.

క్రమేపీ తగ్గుతున్న కృష్ణా జలాలు

సంగమేశ్వరం సమీపంలోని కృష్ణాజలాలు రోజురోజుకు క్రమేపి తగ్గుముఖం పడుతున్నాయి. వర్షాలు పడినప్పటికీ సాగునీటి అవసరాల దృష్ట్యా రెండురాష్ట్రాలు శ్రీశైలం జలాశయం నీటిని వాడుతుండడంతో జలాశయ నీటిమట్టం 885 నుంచి 853.60 అడుగులకు చేరుకుంది. దీంతో సంగమేశ్వరాలయం ప్రధాన గోపురంతో పాటు చుట్టూ ఉన్న ఆలయాల గోపురాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.